సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 5 । నవంబర్ । 2023



కేసీఆర్‌పై గులాబీ పూలు చల్లుతున్న అభిమానులు

కొండంత అభిమానం

కోనాయిపల్లిలో కేసీఆర్‌పై పూల వర్షం

- హ్యాట్రిక్ సీఎం అంటూ నినాదాలు
- బంగారు తెలంగాణ ఆడియో సీడీని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

నంగునూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నంగునూరు మండలం కోనాయిపల్లిలో ఘనస్వాగతం లభించింది. శనివారం నామినేషన్ పత్రాలతో కోనాయిపల్లిలోని తన సెంటిమెంట్ ఆలయానికి వచ్చారు. దీంతో గ్రామస్తులు గులాబీ పూల వర్షం కురిపించారు. పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, ఆలయ కమిటీ ముఖ్యమంత్రిని సన్మానించింది. మహిళలు మంగళహారతులు పట్టి.. తిలకం దిద్దుతూ కేసీఆర్ జిందాబాద్, మూడో సారి మీరే సీఎం అంటూ నినదించారు. ఐదేళ్ల తర్వాత గ్రామానికి వచ్చిన కేసీఆర్ మండల నాయకులకు అభివాదం చేస్తూ వారితో ఫొటోలు దిగారు. అనంతరం బీఆర్‌ఎస్ బంగారు తెలంగాణ ఆడియో సీడీని మంత్రి హరీశ్‌రావుతో కలసి రిలీజ్ చేశారు. గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడేందుకు బీఆర్‌ఎస్ నాయకులు రథాన్ని ఏర్పాటు చేసినా.. ఆలయం ప్రాంగణం కావడంతో అభివాదం చేస్తూ వెళ్లిపోయారు.

కొందరికే అనుమతి

భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు ఆలయంలోకి కొందరు నాయకులనే అనుమతించారు. దీంతో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు అభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు. సీఎం వెంట హరీశ్‌రావు తోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జెడ్పీటీసీ ఉమ, సర్పంచ్ వెంకటేశం, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి తోపాటు మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు తదితరులు పూజలో పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు, సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



బంగారు తెలంగాణ ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న కేసీఆర్, హరీశ్‌రావు

న్యూస్‌రీల్

ఆరబెట్టిన ధాన్యం తీసుకురావాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నరసింహారావు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు

హత్నూర(సంగారెడ్డి): కల్లాల వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు అన్నారు. శనివారం మండలంలోని గుండ్లమాచునూర్, బోరుపట్ల, దౌల్తాబాద్‌లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన, ఏడీఏ అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేంద్రాల వద్దకు రైతులు వరి ఆరబెట్టుకొని తూర్పార పట్టి తీసుకు రావాలని సూచించారు. ప్రతి రైతు కూడా క్లీనర్(యంత్రం)లో ధాన్యం వేసుకోవాలని తెలిపారు. తేమ 17 శాతం లోపు ఉండేలా ధాన్యాన్ని ఆర బెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రేమ్ రాజ్, సుమలత, కల్యాణ్ దాస్, స్రవంతి, వరప్రతాప్, ఐకేపీ నాగరాణి, రేష్మ, స్వరూప, రైతులు శివరాం రెడ్డి శేకర్‌రెడ్డి గంగారెడ్డి, నర్సింలు, రాములు ఉన్నారు.

తొలిమెట్టు బోధన అర్థమవ్వాలి

రాష్ట్ర ఎగ్జామినేషన్ డైరెక్టర్ కృష్ణారావు



మంగాపూర్ పాఠశాలలో పాఠాలు వింటున్న కృష్ణారావు

హత్నూర(సంగారెడ్డి): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో సాధారణ విద్యతోపాటు తొలి మెట్టు బేసిక్స్ సైతం విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించాలని తొలిమెట్టు ఎగ్జామినేషన్ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలో ఉన్న మంగాపూర్, దౌల్తాబాద్ పాఠశాలలను డీఈఓ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పరిశీలించారు. తొలిమెట్టు కార్యక్రమ అమలు పర్యవేక్షణలో భాగంగా జిల్లా పరిషత్ దౌల్తాబాద్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న మంగాపూర్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఆపై రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న తీరును పిల్లలతో కలిసి కూర్చొని విన్నారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు కూడా కృషి చేయాలన్నారు. సీఎంఓ వెంకటేశం, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే విజయానికి దోహదం

బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్



మాట్లాడుతున్న క్రాంతికిరణ్

జోగిపేట (అందోల్): రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన విజయానికి పునాదిలా పని చేయనున్నాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం అందోల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యువఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీ మాట్లాడుతూ క్రాంతి కిరణ్ విజయానికి యువజన, విద్యార్థి శ్రేణులు కీలకంగా పని చేయాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తల బలంతో పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీఎస్టీడీసీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ క్రిశాంక్, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్, ఆత్మగౌరవ కమిటీ అధ్యక్షుడు వీరభద్రరావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

లెక్క.. పక్కా



అభ్యర్థి వ్యయ పరిమితి రూ.40లక్షలు

- అంతకు మించితే అనర్హతే
- నామినేషన్ దాఖలు నుంచి ఖర్చుపై అధికారుల నిఘా

నారాయణఖేడ్: జిల్లాలో ఎన్నికల కోలాహలం జోరందుకుంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో పలువురు అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. అయితే ఎన్నికల బరిలో నిలిచిన వారి రోజువారీ ఖర్చు వివరాలను పక్కాగా అధికారులు నమోదు చేయనున్నారు. నామినేషన్ ప్రక్రియ ఈ పాటికే మొదలు కాగా ఇకనుంచి చేసే ఖర్చులపై వ్యయ పరిశీలన బృందాల నిఘా ఉంటుంది. ఎవరెంత ఖర్చు చేస్తున్నారో వీడియో దృశ్యాల ఆధారంగా లెక్క గడుతుంది. జిల్లా స్థాయిలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ విభాగాలతోపాటు నియోజకవర్గాల స్థాయిలో పరిశీలన బృందాలున్నాయి. ఇవి అభ్యర్థుల ప్రచారంపై నీడలా వెంటాడనున్నాయి. ఆయా రాజకీయ పార్టీల నుంచి టికెట్లు ఖరారైన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారంలో నిమగ్నమయ్యారు. సభలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, వాహనాల కేటాయింపులు తదితరాలతో ప్రచారం హోరెత్తిస్తున్నారు. కాగా అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇవి అమలవుతున్న తీరును తెలుసుకునేందుకు పైవిభాగాలతోపాటు ప్రత్యేక పరిశీలకులను సైతం నియమించింది. నిత్యం అభ్యర్థుల ఖర్చును కూడా లెక్కిస్తుంటారు.

40 లక్షల వరకే ..

1951లో రూపొందించిన ఎన్నికల నియమావళిలో భాగంగా ఏ అభ్యర్థి ఎంతమేర ప్రచారానికి ఖర్చు పెట్టాలనేది నిర్దేశిస్తూ సెక్షన్ 19లో వివరించి ఉంది. ఎన్నికలు జరిగే సమయంలో ధరలకనుగుణంగా వాటిని వెల్లడిస్తారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థి వ్యయ పరిమితి రూ.40 లక్షలుగా ఈసీ నిర్ణయించింది. 2018 ఎన్నికల్లో ఇది రూ.28 లక్షలుగా ఉంది.

అప్పటి నుంచే ..

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఖర్చు లెక్కిస్తారు. దీని కోసం అభ్యర్థి ఏదైన జాతీయ బ్యాంకులో నూతన ఖాతా తెరవాలి. ఈ లావాదేవీలు ఆ అకౌంట్ ద్వారానే నిర్వహించాలి. నామినేషన్‌కు ముందు అభ్యర్థులు చేపట్టిన ప్రచారాలు, సభలు, ఇతర కార్యక్రమాల ఖర్చును సంబంధిత పార్టీల ఖర్చు కింద జమ చేస్తారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. ఫలితాలు వెల్లడైన 30 రోజుల్లోపు ప్రతి అభ్యర్థి తన వ్యయం వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా, లెక్కలను సరైన సమయంలో చూపకున్నా ఆ అభ్యర్థులపై వేటు పడటంతోపాటు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోల్పోతారు.

ఖర్చు తీరు	పట్టణాల్లో (రూ.)	గ్రామాల్లో (రూ.)
చాయ్	10	8
టిఫిన్	35	30
భోజనం	80	80
చికెన్ బిర్యానీ	140	100
మటన్ బిర్యానీ	180	150
పెట్రోల్‌తో ద్విచక్రవాహనం	150	150
ఎల్‌ఈడీ స్క్రీన్లు	10,000	10,000
వాహనంతోపాటు ఎల్‌ఈడీ స్క్రీన్లు (రోజుకు)	1,800	1,800
డ్రైవర్‌తో సహా జీపు, డీజిల్	2,000	2,000
డ్రైవర్‌తోపాటు ట్రక్కు, టెంపో, డీజిల్	3,500	3,500
కెమెరాతో సహా వీడియోగ్రాఫర్	1,800	1,800
లౌడ్‌స్పీకర్	900	800
ఆటో	600	600
ట్రాక్టర్	1,000	1,000
ఫంక్షన్‌హాల్	15,000	12,000

రెండోరోజు ఆరు నామినేషన్లు

సంగారెడ్డి : నామినేషన్ల స్వీకరణ రెండో రోజైన శనివారం సంగారెడ్డి జిల్లాలో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి శరత్ తెలిపారు. అందోల్ నియోజక వర్గంలో రెండు, జహీరాబాద్ నియోజకవర్గంలో ఒకటి, పటాన్‌చెరు నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదని తెలిపారు.

- పటాన్‌చెరు నియోజకవర్గంలో మండలం ఇంద్రేశంకు చెందిన దేవయ్య పాలాది ఎస్‌యూసీఐ సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. పటాన్‌చెరు గౌతమ్‌నగర్‌కు చెందిన గణపురం వేణుగోపాల్, రామచంద్రపురం ఎస్‌ఎన్ కాలనీకి చెందిన వరికుప్పల యాదగిరి.. వీరిద్దరు సైతం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖ లు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజాకు అందజేశారు.
- అందోల్‌కు.. వట్‌పల్లి మండలం గొర్రెకల్ గ్రామస్తుడు బేగరి ఆమోస్, పోతుల బొగుడ గ్రామానికి చెందిన బక్క మల్లేశం.. స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండుకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

ఏర్పాట్ల పరిశీలన

జహీరాబాద్: స్థానిక రిటర్నింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను కలెక్టర్ శరత్ పరిశీలించారు. శనివారం ఆయన జహీరాబాద్‌ను సందర్శించారు. రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు వీలుగా చేసిన ఏర్పాట్లను, నామినేషన్లు తీసుకునే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకారెడ్డితో పాటు కార్యాలయంలో గల వివిధ టీంలతో సమావేశమయ్యారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



జహీరాబాద్: నామినేషన్ పత్రాలను అందజేస్తున్న చంద్రశేఖర్

కాంగ్రెస్ జహీరాబాద్ అభ్యర్థి చంద్రశేఖర్...

కాంగ్రెస్ అభ్యర్థిగా ఎ.చంద్రశేఖర్ శనివారం ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటారెడ్డికి పత్రాలను అందజేశారు. మరో సెట్ నామినేషన్ వేసే రోజున భారీ ర్యాలీతో వెళ్లి వేయనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన వెంట పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి, నాయకులు అనంత్ నవీన్‌కుమార్, ఎండీ జాఫర్‌లతోపాటు న్యాయవాదులతో కలిసి వెళ్లి నామినేషన్ వేశారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

విధుల్లో అప్రమత్తత అవసరం



అధికారులతో మాట్లాడుతున్న జయకర్

వ్యయ పరిశీలకుడు జయకర్

సంగారెడ్డి టౌన్: ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ బృందాలు అన్నివేళలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సంగారెడ్డి నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు కేపీ జయకర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. సహాయ వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైలెన్స్ టీంలతో సమావేశం నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయ వ్యయ పరిశీలకులు సిద్ధారెడ్డి, ఇందిర పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రం సందర్శన

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ నామినేషన్ కేంద్రాన్ని శనివారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు జయకర్(ఐఆర్‌ఎస్) సందర్శించి, అకౌంటెంట్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అభ్యర్థికి సంబంధించిన అకౌంట్స్ వివరాలు ఏ విధంగా నమోదు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ నెల 2వ తేదీ వరకు ఖర్చును ఆయా పార్టీ భరిస్తుందని, మూడో తేదీ నుంచి ఖర్చు అభ్యర్థి ఖాతాలో వస్తుందని తెలిపారు.

వలస ఓటర్లదే కీరోల్

- పారిశ్రామిక వాడలో లక్ష ఓట్లు వారివే
- ప్రసన్నం చేసుకునే పనిలో నాయకులు నిమగ్నం

మినీఇండియాలో మొత్తం 3.81 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. అందులో లక్ష వలస ఓటర్లు కీలకం కానున్నారు. దీంతో నాయకులు వీరిని తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే పారిశ్రామికవాడలో అన్ని రాష్ట్రాల నుంచి వలసొచ్చి ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. అనేక ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చి స్థిరపడిన వారూ ఉన్నారు. అందుకే పటాన్‌చెరు నియోజకవర్గాన్ని మినీఇండియా అని పిలుస్తారు.



బొల్లారం పారిశ్రామిక వాడ

జిన్నారం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని జిన్నారం, బొల్లారం, గడ్డపోతారం, బొంతపల్లి, పాశమైలారం, పటాన్‌చెరు ప్రాంతాల్లో వేల సంఖ్యలో వివిధ రకాల పరిశ్రమలున్నాయి. ఇందులో లక్షల సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. పారిశ్రామికవాడలు అభివృద్ధి చెందుతుండటంతో కొత్త కాలనీలు కూడా ఏర్పడుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరులోనే అధిక సంఖ్యలో 3,81,299 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్ష వరకు వలస కార్మికులతోపాటు ఉద్యోగుల ఓట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. దీంతో తమవైపు తిప్పుకునేందుకు నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వలస ఓటర్లతో స్థానిక నేతలు మంతనాలు మొదలు పెట్టినట్లు సమాచారం. పటాన్‌చెరు ఎమ్మెల్యే గెలుపులో ఈ ఓట్లు కీలకంగా మారనున్నాయి.

ఆయా రాష్ట్రాల వారు

ఆయా రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడే ఉండి ఆయా పరిశ్రమల్లో కార్మికులుగా, కాంట్రాక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. దేశంలోని ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఆంధ్ర, అస్సాం, బిహార్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఈ ప్రాంతంలో అధికంగా నివాసం ఉంటున్నారు.

నాయకులను రప్పిస్తున్నారు..

ఆయా రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీంతో ఎమ్మెల్యేగా బరిలో ఉన్న నేతలు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ఓట్లు రాబట్టేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన నేతలను రప్పిస్తున్నారు. అక్కడి నేతలు చెబితే వింటారని నాయకులు భావిస్తున్నారు. ఇక వలస ఓట్లు ఎటు వైపు తీర్పు ఇస్తారో చూడాలి.



రుద్రార్.. అభివృద్ధిలో షాన్‌దార్

అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ పాలనను మళ్లీ తెచ్చుకుందామని బీఆర్‌ఎస్ నారాయణఖేడ్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రుద్రార్‌లో శనివారం ప్రచారం నిర్వహించారు. గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని వివరించారు. నియోజకవర్గంలో దళితబంధు కింద 95 మందికి రూ.9.50 కోట్లు అందించామన్నారు. – నారాయణఖేడ్



మరో చాన్స్ ఇవ్వరూ..

బీఆర్‌ఎస్ అభ్యర్థి కె.మాణిక్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం పట్టణంలోని 19, 20, 21, 22వ వార్డుల్లో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి తనను మరో మారు గెలిపించి ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. – జహీరాబాద్



పెద్దాయన.. నేనున్నా..

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే దమ్మున్న నాయకుడు కేసీఆర్ అని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగులపల్లి, కోనాపూర్, ఆరూర్, మెలగిరి పేట్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. – సదాశివపేట రూరల్(సంగారెడ్డి)

మిర్చీ తీసుకో.. ఓటు వేసుకో..


గజ్వేల్‌లో మిర్చి వేస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్ : అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్‌ను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుల పగుళ్లతో కేసీఆర్ కుటుంబం అవినీతి బయటపడిందని విమర్శించారు.అభివృద్ధి పేరిట వేలాది ఎకరాల భూములను లాక్కొని అనేక కుటుంబాలను రోడ్డున పడేశారని ఆరోపించారు. ప్రచారంలో భాగంగా ఓ బండి వద్ద నర్సారెడ్డి బజ్జీలు వేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సర్దార్‌ఖాన్, మల్లారెడ్డి, గోపాల్‌రావు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామక్క పాట.. ప్రతాప్ ఆట


మహిళలతో నృత్యం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్‌పై రామక్క పాడిన పాట నాయకులు, మహిళల్లో జోష్ నింపింది. మర్కూక్‌లో ఆ పాటకు ప్రతాప్‌రెడ్డి మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఆయనతోపాటు కార్యకర్తలు కూడా చిందేశారు.

పూరీలు తినెయ్.. కారుకు ఓటెయ్..


ముస్త్యాలలో పూరీలు కాలుస్తున్న ఏకానందం

చేర్యాల(సిద్దిపేట): మండలంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం జోరందుకుంది. శనివారం ముస్త్యాల గ్రామంలో ఆ పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఉల్లెంగుల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగుల ఏకానందం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా ఓ హోటల్‌లో పూరీలను కాలుస్తూ.. కారు గుర్తుకే ఓటు వేసి పల్లాను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, సర్పంచ్ పెడతల ఎల్లారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ తాటికొండ సదానందం, మల్లన్న ఆలయ డైరెక్టర్ కొంగరి గిరిధర్, దాసు, లక్ష్మణ్, ప్రశాంత్, రాము, మహేందర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సిద్దిపేటజోన్: ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట నియోజకవర్గ పరిధికి సంబంధించి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. శనివారం రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు రమేష్ బాబు, దిలీప్ నాయక్ దీనిని పరిశీలించారు. ఫిర్యాదులు, ఓటరు జాబితా సందేహాలు, సమాచారం కోసం 08457–359950 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని అధికారులు పేర్కొన్నారు.


కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న త్రిష దామోదర

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ యువ నాయకురాలు త్రిష దామోదర అన్నారు. శనివారం ఆమె నాదులాపూర్, మాసాన్‌పల్లి, కొడెకల్ గ్రామాల్లో ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటువేసి తన తండ్రి, ఆ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మనాభరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రమేశ్ గౌడ్, క్రిష్ణ, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరిచూపు వారిపైనే..

- మల్లన్నసాగర్ నిర్వాసితులను మచ్చిక చేసుకునేందుకు ప్రధాన పార్టీల యత్నం
- జోరుగా సంప్రదింపులు, సమావేశాలు




గజ్వేల్‌లోని మల్లన్నసాగర్ నిర్వాసితుల ఆర్‌అండ్ఆర్ కాలనీ

గజ్వేల్: గజ్వేల్ అసెంబ్లీ ఎన్నికల్లో మల్లన్నసాగర్ నిర్వాసితుల వ్యవహారం ఆసక్తికరంగా మారింది. వీరిని తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ఆరాటపడుతున్నాయి. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్ఆర్ కాలనీని నిర్మించిన సంగతి తెలిసిందే. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం వల్ల తొగుట మండలంలో పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మాపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి గ్రామాలు పూర్తిగా ముంపునకు గురైన సంగతి తెలిసిందే. కాగా ఏటిగడ్డకిష్టాపూర్‌లో 1253, లక్ష్మాపూర్‌లో 388, వేములఘాట్‌లో 1252, పల్లెపహాడ్‌లో 921, రాంపూర్‌లో 320, బ్రాహ్మణ బంజేరుపల్లిలో 267, ఎర్రవల్లిలో 800, సింగారంలో మరో 330కుపైగా కుటుంబాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ లెక్కన ఆయా గ్రామాలకు చెందిన సుమారు 10వేలకుపైగా ఓట్లు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యాయి. కాగా ఆయా గ్రామాల్లో భూమితో ఇతర ఆస్తులకు పరిహారం ఇవ్వడంతోపాటు ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.7.5లక్షలు, ఇల్లు.. ఇల్లు వద్దంటే వారికి ఓపెన్ ప్లాటు, మరో రూ.5లక్షలు పంపిణీ చేశారు. అంతేకాకుండా కుటుంబంలో 18ఏళ్ల పైబడిన వారుంటే ఇల్లు లేదంటే ఓపెన్‌ప్లాటు, రూ.5లక్షలు ఇచ్చారు. ఇంకా ఎన్నో సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. 95శాతం మేరకు సమస్యలను పరిష్కరించిన తాము మిగిలినవి కూడా నెరవేర్చుతామని అధికార బీఆర్ఎస్ పార్టీ హామీ ఇస్తుంది. అంతేకాకుండా నిర్వాసితులతో నాయకులు నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారు. ఇదే క్రమంలో ఐదు రోజుల క్రితం వర్గల్ మండలం గౌరారం గ్రామంలో మల్లన్నసాగర్ నిర్వాసితులతో మంత్రి హరీశ్‌రావు, టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితుల త్యాగం గొప్పదని, వారికి ఎన్ని సేవలు చేసినా తక్కువేనని పేర్కొంటూ, పెండింగ్‌లో ఉన్న 5–10శాతం సమస్యలను సైతం పరిష్కరిస్తామని, ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. గతనెల 20న మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలో నిర్వహించిన ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో నిర్వాసితుల అంశాన్ని సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ న్యాయ సమ్మతమేనని, ఎన్నికలు ముగిసిన వెంటనే ఒక రోజు ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శిని, కలెక్టర్‌ను గజ్వేల్‌కు పిలిపించి వందశాత సమస్యల పరిష్కారానికి ఆదేశాలిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు సైతం నిర్వాసితులను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నికల్లో తమకు మద్దతు ప్రకటిస్తే మీ తరపున పోరాడుతామని హామీ ఇస్తున్నారు. ప్రధాన పార్టీల ప్రచారాల నేపథ్యంలో నిర్వాసితులు ఎటువైపు నిలుస్తారనేది తేలాల్సి ఉంది.

పనిచేసే ప్రభుత్వానికి పట్టం కట్టండి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి


ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొండపాక: పనిచేసే ప్రభుత్వానికి పట్టం కట్టాలని, సీఎం కేసీఆర్‌ను మళ్లీ గెలిపించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పిలుపునిచ్చారు. శనివారం చిన్నకిష్టాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పథకాలు, మేనిఫెస్టో గురించి వివరించారు. ప్రధాన కూడలిలో మహిళలు, నాయకులు కలిసి రామక్క పాటపై నృత్యం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల సారథి కేసీఆర్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకయ్య, ఎంపీటీసీ భగవాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రం, యూత్ అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, కొండపోచమ్మ డైరెక్టర్ లక్ష్మణ్‌రాజ్, ఉపసర్పంచ్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్


బంజర్‌పల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పేదల కలలు సాకారం కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఆ పార్టీ హుస్నాబాద్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కోరారు. శనివారం పట్టణంలో విజయభేరి యాత్ర నిర్వహించారు. అంతకు ముందు బంజర్‌పల్లి, పందిల్ల, పొట్లపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తం పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ.2500, గ్యాస్ సిలిండర్ రూ.500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల సాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అసమర్థతతోనే నియోజకవర్గం అభివృద్ధి కాలేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు వల్లపు రాజు, చిత్తారి పద్మ, సరోజన పాల్గొన్నారు.

దోచుకోవడం బీఆర్ఎస్ ఎజెండా

కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు


మాట్లాడుతున్న రోహిత్‌రావు

పాపన్నపేట(మెదక్): దోచుకోవడం..దాచుకోవడమే బీఆర్ఎస్ నాయకుల నైజమని మెదక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కొత్తపల్లి, పాపన్నపేట, నార్సింగి, బాచారం, చిత్రియాల్, తమ్మాయపల్లి, అమ్రియా తండా, దౌలపూర్, పొడిచన్‌పల్లి తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దత్తత తీసుకున్న పాపన్నపేట గ్రామ రోడ్డు చూస్తే చాలు.. ఆమె చేసిన అభివృద్ధి ఏపాటిదో తెలుస్తుందన్నారు. మిషన్ కాకతీయ పేరిట చెరువుల్లో గోతులు తవ్వి రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. పండగ వస్తే తండాల్లో తాగునీటి కోసం తండ్లాట ఉందన్నారు. రుణమాఫీ ఎంతమంది రైతులకు చేశారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ మాటల గారడీని నమ్మొద్దని తెలిపారు. పాపన్నపేట కో ఆప్షన్ సభ్యులు గౌస్, ఏఎంసీ డైరెక్టర్ కిషన్‌రెడ్డి, పద్మశాలి సంఘం కార్యదర్శి తూర్పు నగేష్, ఉమామహేశ్వర్, మన్సూర్ తోపాటు వందలాది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎఫ్ఏసీఎస్ చైర్మన్ త్యార్ల రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, గోవింద్ నాయక్, శ్రీకాంతప్ప, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

బీసీ బిడ్డను.. ఆశీర్వదించండి

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్ యాదవ్


మాట్లాడుతున్న మురళీధర్ యాదవ్

కౌడిపల్లి(నర్సాపూర్): బీసీ బిడ్డను అయిన తనను ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్ యాదవ్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తునికి, వెంకట్రావ్‌పేట్, ముట్రాజ్‌పల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిగా చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 15 ఏళ్లు సునీతారెడ్డి, 10ఏళ్లు మదన్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా చేసినప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. 10 బస్సులతో పేరుకే నర్సాపూర్ డిపోను ప్రారంభించారని.. ఏ గ్రామానికి అవి సక్రమంగా వెళ్లడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో శ్మశాన వాటికలు, రైతు వేదికలు నిర్మించి, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా తనని గెలిపిస్తే నియోజకవర్గాన్ని చార్మినార్‌జోన్‌లో కలపడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గోడ రాజేందర్, శ్రీరామ్‌రెడ్డి, రాకేష్, చెల్ల కుమార్, అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం


లద్నూరులో కుట్టు మిషన్‌ను కుడుతున్న కొమ్మూరి అరుణ

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సతీమణి అరుణ అన్నారు. శనివారం మండలంలోని లద్నూరు గ్రామంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. రైతులకు కోసం అనేక ప్రాజెక్టులు రూపొందించిందన్నారు. బీఆర్ఎస్ నేతల మాయ మాటలు నమ్మొద్దని చెప్పారు. స్థానికుడైన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఓటు వేసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, దాసరి పద్మారెడ్డి, రామడుగు బాలరాజు, శ్రీధర్‌రెడ్డి, జీడికంటి సురేష్, బోగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చేది కాంగ్రెస్సే

ఆవుల రాజిరెడ్డి


ఎన్నికల ప్రచారంలో ఆవుల రాజిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, బీఆర్ఎస్ పార్టీలా మాట తప్పదని ఆ పార్టీ నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాంపూర్‌లో పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం కిష్టాపూర్, పోతంశెట్టిపల్లి, వెంకటాపూర్, వసురాం తండా, అంసాన్ పల్లి, పోతిరెడ్డిపల్లి, జలాల్‌పూర్, కొంగోడ్, అప్పాజిపల్లి, మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. రాజిరెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో రాష్ట్రప్రభుత్వం నర్సాపూర్ నియోజకవర్గంలో ఏ ఒక్క నిరుపేదకు ఇల్లు కట్టిచ్చిన పాపాన పోలేదన్నారు. అధికారంలోకి రాగానే ఆరు హామీలు నెరవేర్చుతామని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశం గౌడ్, మహేశ్వర్ రెడ్డి, సుహాసిని రెడ్డి, గోవర్ధన్, జనార్దన్ రెడ్డి, అంజాగౌడ్, గొండ కృష్ణ, ఆగంగౌడ్, ప్రభాకర్, రమేష్, వెంకట్ గౌడ్, ఉపేందర్, అల్లి చందు, అనిల్, మహేందర్ రెడ్డి, వెంకటేశం, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

మాటతప్పిన కేసీఆర్‌ను ఓడించాలి

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్


గౌరారంలో ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్


వర్గల్(గజ్వేల్): దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు ఇస్తానని మాటతప్పిన కేసీఆర్‌ను ఓడించి.. తనను ఆశీర్వదించి గెలిపించాలని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని గౌరారంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు హారతిపట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలవేసి, ఎల్లమ్మ, పెద్దమ్మ, పోచమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో మమేకమవడంతోనే హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు తనను కడుపులో పెట్టుకుని చూసుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పూదరి నందన్‌గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం మహిపాల్, మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, నిఖిల్ పాల్గొన్నారు.

పూజలు చేసి.. ప్రచారం ప్రారంభించి..


ప్రచార రథానికి పూజలు నిర్వహిస్తున్న మల్లేశం యాదవ్

దుబ్బాక: ప్రచార వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దుబ్బాక బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి సల్కం మల్లేశం యాదవ్ శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకులకుంట మల్లన్న దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన స్వగ్రామమైన పోతారంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసుగుచెందారని ఆరోపించారు. ఏనుగు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

ప్రతీ గడపకు ప్రభుత్వ పథకాలు


మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. శనివారం ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో మండలంలోని దుదగొండ, తుమ్నూర్, బోరంచ, రాణాపూర్, ముగ్దుంపూర్, మాయికోడ్, మనూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖేడ్‌ను అభివృద్ధి పరిచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతీ గడపకు చేర్చామన్నారు. తనకు మరోమారు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ, విఠల్‌రావు, సత్యపాల్‌రెడ్డి, పరమేశ్వర్, సత్యపాల్‌రెడ్డి, పండరి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒట్టేసి చెప్పన్నా.. ఓటేస్తానని..


ఓటేయాలని మాట తీసుకుంటున్న రాకేష్‌రెడ్డి

చేర్యాల మండల పరిధిలో కాంగ్రెస్ ప్రచారం జోరందుకుంది. శనివారం ఆ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు కొమ్మూరి రాకేష్‌రెడ్డి ఆకునూరు, కొత్త దొమ్మాట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను కలుస్తూ ఆరు గ్యారంటీల గురించి వివరించారు. తన తండ్రికి తప్పక ఓటేయాలని మాట తీసుకున్నారు.

–చేర్యాల(సిద్దిపేట)